## క్లుప్తంగా

### పిక్నిక్ సందడి



జోగింపేట రిసార్ట్స్‌లో జన సందడి

సీతానగరం: మండలంలోని జోగింపేటలోని రిసార్ట్స్‌లో పిక్నిక్ సందడి కనిపించింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు కుటుంబాలతో వచ్చి, ఆటపాటలతో సరదాగా గడిపారు. మధ్యాహ్నం తమ వెంట తీసుకువచ్చిన భోజనాలు చేశారు. రిసార్ట్స్ ఆనుకుని, రహదారి ఉండడం, బస్సు సౌకర్యం కూడా ఉండడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున ఇక్కడ సేద తీరేందుకు వస్తుండడం విశేషం.

### నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీఐ శ్రీనివాసరావు

సాలూరు: పట్టణంలోని నవజీవన్ పూర్ చిల్డ్రన్ హాస్టల్ వద్ద అమ్మ సేవా సొసైటీ అండ్ ఐఆర్‌డీఎస్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో పట్టణ సీఐ శ్రీనివాసరావు చేతులమీదుగా నిరుపేదలు, వృద్ధులు, రోగులకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు, చీరలు ఆదివారం పంపిణీ చేశారు. సీఐ మాట్లాడుతూ సామాజిక సేవకు సంస్థలు ముందుకు వస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, స్పందన దివ్యాంగుల సేవా సమాజం అధ్యక్షుడు కె.సురేష్ పాల్గొన్నారు.

### ప్రారంభానికి సిద్ధం



రంగులద్దుకున్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు

బలిజిపేట: మండలంలోని అరసాడ పంచాయతీ పరిధిలో ని అరసాడ, కొత్త అరసాడ గ్రామాల్లో కొత్తగా నిర్మించిన రక్షి త మంచినీటి పథకా లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఒక్కో ట్యాంకు 10 వేల లీటర్ల సామర్థ్యంతో ఒక్కో దానికి రూ. 10లక్షలు చొప్పున ఖ ర్చు చేశామని సర్పంచ్ పోల సుజాత తెలిపారు. అంతేకాకుండా జల్‌జీవన్ మిషన్ పను ల ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పైపులైన్, కుళాయిల ఏర్పాటు పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయిన వెంటనే ఆయా గ్రామాల్లోని పథకాలు ప్రారంభిస్తామన్నారు.

### 'ఆరోగ్యశ్రీ' ప్రత్యక్ష ప్రసారానికి తరలిరండి

సాలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద జరిగే డాక్టర్ వైఎస్సార్ ఆరో గ్యశ్రీ పథకం పెంపు కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారానికి ప్రజాప్రతినిధులంతా హాజరుకావాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. ఇప్పటివరకు ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు అయ్యే వైద్యఖర్చులు మాత్రమే ప్రభుత్వం భరించేది. అయితే ఇప్పు డు ఆ పరిమితిని రూ.25 లక్షల కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించే ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం వీక్షించేందుకు అందరూ రావాలన్నారు.

### ఘనంగా ఘంటసాల ఆరాధనోత్సవాలు



ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పట్టణ ప్రముఖులు

సాలూరు: పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో కబీర్ షా ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఘంటసాల ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఘంటసాల వెంక టేశ్వరరావు జయంత్యుత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు గాయనీగాయకులు 12 గంటల పాటు నిర్విరామంగా ఘంటసాల పాట లు పాడి, అలరించారు. అంతకుముందు కొంకి వీధి సమీపంలోని ఘంటసాల విగ్రహానికి ప్రముఖులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యద ర్శి జర్జాపు సూరిబాబు, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులపై చలి పంజా..

- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి
- సూచనలు పాటించాలంటున్న వైద్యులు



పాలకొండ పట్టణంలో తెల్లవారుజామున కురుస్తున్న పొగమంచు

పాలకొండ రూరల్: ప్రస్తుత శీతాకాల సీజన్‌లో ఐడి ఈడు పిల్లల్లో ఎక్కువ మంది న్యుమోనియాతో పాటు వివిధ రకాల శ్వాసకోశ వ్యాధులతో బాధ పడుతున్నట్టు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కేవలం కాలుష్యం, వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, అపరిశుభ్రమైన పరిసరాలతో పాటు పౌష్టికాహారం లోపమే దీనికి కారణమని వైద్యులు చెబుతున్నారు. ఈక్రమంలో ప్రత్యేకంగా న్యుమోనియా వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం ప్రత్యేక కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా వైద్యారోగ్య శాఖ ఇప్పటికే సమాయత్తమైంది. పిల్లలకు ఏడేళ్ల వయసు వచ్చే వరకు వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ కారణంగా వీరు వాతావరణ మార్పులకు అనుగుణంగా శ్వాసకోశ వ్యాధులకు గురయ్యే ప్రమాదముందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో వాయు కాలుష్యం కారణంగా రెండేళ్లలోపు చిన్నారుల్లో ఆస్తమా లక్షణాలు కనిపిస్తున్నాయి. ఎటువంటి కాలుష్యం లేని గిరిజన ప్రాంతాల్లో నివశించే చిన్నారుల్లో న్యుమోనియా రావడానికి ఇక్కడ ఉన్న శీతల వాతావరణం కొంతమేర కారణమని వైద్యులు చెబుతున్నారు. ఏజెన్సీ కలబోసి ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో కొద్ది రోజులుగా తుపాను ప్రభావంతో వాతావరణంలో చల్లదనం చోటుచేసుకుంది. తాజాగా మరో తుపాను ఈ నెల 15 నుంచి ప్రభావం చూపనుందన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. చల్లని వాతావరణంలో తిరిగాడే చిన్నారులపై పడే గాలిలో తేమ ఊపిరితిత్తుల్లో చేరి న్యుమోనియాకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా జలుబు, దగ్గు, ఆయాసం అధికమై చిన్నారులను ఆరోగ్యపరంగా ఇబ్బంది పెడుతుంది. ప్రస్తుత సీజన్‌లో చిన్నారులను ఆరుబయట తిరగకుండా చూసుకోవాలి. శీతల గాలి నుంచి ఉపశమనం అందించేందుకు ఉన్ని వస్త్రాలను ధరింపచేయాలి.



శ్వాస సంబంధిత సమస్యతో పీహెచ్‌సీలకు చిన్నారులను తీసుకువస్తున్న తల్లిదండ్రులు

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి.....**

-పిల్లలు దగ్గు, జలుబు, తీవ్ర జ్వరంతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటే సొంత వైద్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

-పిల్లలకు అతిగా యాంటీబయాటిక్స్ వాడడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో సులభంగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ చోటుచేసుకునే అవకాశం ఉంది.

- నిపుణులైన వైద్యుల సిఫారసు లేకుండా పిల్లలకు ఎటువంటి మందులు వాడకూడదు.

**నిర్లక్ష్యం తగదు..**



ఐదేళ్లలోపు చిన్నారుల్లో దగ్గు, ఆయాసం, జలుబు వంటి న్యుమోనియా లక్షణాలున్నప్పుడు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా ఏజెన్సీ నుంచి ఈ తరహా లక్షణాలతో పిల్లలు వస్తున్నారు. సకాలంలో వైద్యం అందిస్తే భయపడాల్సిన అవసరం లేదు. వ్యాధి నివారణ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. – డాక్టర్ జి.రవీంద్రకుమార్, చిన్నపిల్లల వైద్యనిపుణుడు, పాలకొండ ఏరియా ఆస్పత్రి

- ముఖ్యంగా పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు జింక్ సప్లిమెంట్‌ను అందించాలి.
- చంటి పిల్లలకు కనీసం తొమ్మిది నెలల పాటు తల్లిపాలు ఇస్తే వ్యాధిని తట్టుకునే రోగనిరోధక శక్తి సమకూరుతుంది.
- ఐదేళ్లలోపు చిన్నారులను న్యుమోనియా అధికంగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది.
- పాఠశాలలకు వెళ్లే పిల్లల రోజువారి ఆరోగ్య స్థితిగతులను తల్లిదండ్రులు లేదా సంరక్షకులు గమనిస్తుండాలి.
- పిల్లలు చలిని తట్టుకునేలా వస్త్రాధారణ చేయించాలి. కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహార పదార్థాలు అందించాలి.

## టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పుడు ప్రచారం మానుకోవాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. చినమేరంగిలోని తన నివాసంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్ష నాయకులు పాత వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంపై కక్షపూరితంగా సోషల్‌మీడియాలో బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన బాలికలకు నిర్లక్ష్యంగా అందిస్తున్న వైద్య సదుపాయాలపై మాట్లాడిన పాత వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేను మాట్లాడినట్లు గత రెండు రోజులు నుంచి తెలుగు దేశం పార్టీ నాయకులు కొన్ని వాట్సాప్ గ్రూపుల్లోనూ, యూట్యూబ్ ఛానెల్స్‌లో ప్రచారం చేస్తున్నారని, అది తప్పుడు ప్రచారంగా ప్రజలు గమనించాలని ఆమె కోరారు. 2018 సెప్టెంబర్ 5న అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సాలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో 5గురు గిరిజన బాలికలను కింద కూర్చోబెట్టి సెలైన్ బాటిల్స్ ఎక్కించడాన్ని నేను ఖండిస్తూ యూట్యూబ్‌లో పోస్ట్ చేసిన వీడియోను టీడీపీ నాయకులు ఇప్పుడున్న ప్రభుత్వాన్ని నేను విమర్శించినట్లు ప్రచారం చేస్తున్నారని అన్నారు. దీన్ని ప్రజలు గమనించాలని కోరారు.

## ముమ్మరంగా వరి నూర్పులు



గుమ్మలక్ష్మీపురంలో యంత్రంతో వరి నూర్పిడి చేస్తున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ధాన్యం నూర్పులు ముమ్మరంగా సాగుతున్నాయి. కోతల సమయంలో వచ్చిన మిచాంగ్ తుఫాన్ బారి నుంచి బయట పడిన రైతులు వరి నూర్పుల్లో బీజీగా ఉన్నారు. ఇప్పటికే 80 శాతం ధాన్యం నూర్పులు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. మరి కొద్ది రోజుల్లో గిరిజనులు ఎంతో సంప్రదాయంగా నిర్వహించుకునే కందికొత్తల పండుగతో పాటు క్రిస్మస్, సంక్రాంతి వంటి ప్రధాన పండుగలు రానుండటంతో డబ్బులు చేతికి అందాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో రైతులంతా వరి నూర్పులపై దృష్టి సారించడంతో ధాన్యం నూర్పు యంత్రాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆశించిన దిగుబడులు రావడంతో రైతులు ఉత్సాహంగా నూర్పిడిలు చేసి పంటను విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు.

## దిశ చట్టంపై అవగాహన



దిశచట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై లావణ్య

కురుపాం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు దిశ చట్టంపై ఆదివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దిశ పోలీస్ స్టేషన్ ఎస్సై లావణ్య పాల్గొని సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలి, మహిళల రక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దిశ చట్టంలోని అంశాలతో పాటు దిశ యాప్‌ను ఎలా వినియోగాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబల్ క్రాంతికుమార్, కురుపాం పోలీస్ స్టేషన్ సిబ్బంది లక్ష్మీ, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

## • ఘనంగా సెమీ క్రిస్మస్



క్రీస్తును స్తుతిస్తూ అభినయిస్తున్న యువతీ,యువకులు

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని ఆర్‌సీఎం లూర్థుమాత ప్రార్థనా మందిరంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఫాదర్ భరత్ రెడ్డి నేతృత్వంలో విశ్వాసకులకు కరుణామయుడు క్రీస్తు సందేశాన్ని చదివి, వినిపించారు. ఏసు లోక రక్షకుడని.. ఆయన చూపిన ప్రేమమార్గం అనుసరణీయమని ఫాదర్ తెలిపారు. క్రీస్తు కీర్తనలకు యువతీ,యువకుల అభినయం ఆకట్టుకుంది.

### మంచినీటి బావి పునరుద్ధరణ

సీతంపేట: మండలంలోని సతివాడ గ్రామంలో మంచినీటి బావిని ఆదివారం పునరుద్ధరించి, ప్రజలకు తాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో జరిగిన స్థల వివాదంలో గ్రామస్తులంతా బావిని పడగొట్టారు. ఎట్టకేలక అధికారులు జోక్యం చేసుకోవడంతో సర్పంచ్ పాసర్ల రామారావు, ఎంపీటీసీ సభ్యుడు పాత్రుకొండ రాంబాబు, వీఆర్‌ఏ గౌరీశంకర్ ఆధ్వర్యం బావిని పునరుద్ధరించారు.

### అదనంగా ధాన్యం తీసుకుంటే చర్యలు


పాలకొండ: రైతుల నుంచి మిల్లర్లు అదనపు ధాన్యం తీసుకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ పి. సోమేశ్వరరావు అన్నారు. కొంతమంది మిల్లర్లు 80 కిలోల బస్తాకు 4 కిలోల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని పలువురు రైతులు ఆదివారం ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లవద్దన్నారు. రైతుభరోసా కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం నేరుగా మిల్లర్లు అన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

### ఆర్థిక సాయం

రాజాం: శిష్టకరణాల్లో పేద కుటుంబాలకు అండగా నిలవాలని ఆంధ్రా, తెలంగాణ శిష్టకరణాల లిఫ్టింగ్ హ్యాండ్స్ సంఘం అడ్మిన్ త్యాడ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని అమ్మవారికాలనీలో శిష్టకరణ సంఘంలోని పేద కుటుంబానికి చెందిన బగ్గాం కరుణాకర్ ప్రారంభించిన కిరాణాషాపును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిష్టకరణాల లిఫ్టింగ్ హ్యాండ్స్ యూనిట్ అడ్మిన్ సంజుక్త ప్రసాద్ ఆలోచనలతో సభ్యులు అంతా కలిసి రూ.30 వేలు ఆర్థికసాయాన్ని కరుణాకర్‌కు అందించారు. సంఘంలోని పేదలు చిరువ్యాపారాలు, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు సభ్యులు సహకారం అందించాలని కోరారు.

### పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఎమ్మెల్యే జోగారావును సన్మానిస్తున్న పాత్రికేయులు

సీతానగరం: పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని జోగింపేట తోటలో ఆదివారం జరిగిన పార్వతీపురం మన్యం జిల్లా పాత్రికేయుల సంఘం పిక్నిక్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై, కాసేపు మాట్లాడారు. సమాజంలో పాత్రికేయ వృత్తికి చాలా గౌరవం ఉందని, పాత్రికేయుల ద్వారా ప్రజాసమస్యలు ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చి, పరిష్కారమవుతున్నాయన్నారు. రాత్రి, పగ లు అనే తేడా లేకుండా ప్రజాసేవే లక్ష్యంగా, ప్రజలకు మంచి జరగాలన్న తాపత్రయంతో పాత్రికేయు లు పనిచేస్తారని ప్రశంసించారు. ప్రభుత్వం కూడా పాత్రికేయుల సేవలను గుర్తిస్తోందని, ఇప్పటికే అక్రిడేషన్‌లు ఇవ్వడం జరిగిందని, ఇవి ఉన్న వారికి హెల్త్‌కార్డులు కూడా మంజూరు చేయడం జరిగింద న్నారు. త్వరలో అక్రిడేషన్లు ఉన్న వారికి ఇళ్ల స్థలా లు ఇచ్చేందుకు కూడా మంత్రి మండలి నిర్ణయం తీసుకుందన్నారు. ఎప్పటిలాగే నిస్వార్థంగా ప్రజాసమస్యలపై పోరాడాలని, పత్రికల పాలసీ ఏదైనా ప్రజల పక్షాన నిలబడాలన్నారు. అనంతరం పాత్రికేయులంతా కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్వతీపురం పట్టణ అధ్యక్షుడు కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

## మత్స్య సంపద అభివృద్ధికి చర్యలు



ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు

సీతంపేట: మన్యంలో మత్స్య సంపద అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్ట్ జీవీఏ ప్రసాద్ తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని కుడ్డపల్లి, సిలిగాం గ్రామాల్లో ఆదివారం పర్యటించి చేపల రైతులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు జరుగుతున్న ఫిష్ ఫార్మింగ్ ఇంప్లిమెంటేషన్‌లో భాగంగా ఉచిత చేపపిల్లల పంపిణీ, వలలు, టూ వీలర్స్, ఐస్‌బాక్స్, ఇన్‌పుట్స్ వంటివి 90 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తామన్నారు. ఈ ఆర్థిక భరోసాతో జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ డబ్బీరు గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మన్యంలో పర్యాటకుల సందడి



మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకులు

సీతంపేట:

మన్యంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో పార్కు కలకలలాడింది. జలవిహార్‌లో బోటు షికారు చేశారు. కయాకింగ్, బంజీ ట్రంపోలిన్, బొమ్మ ట్రైన్, స్కై సైక్లింగ్‌లతో చిన్నారులు సందడి చేశారు. మెట్టుగూడ జలపాతానికి కూడా అత్యధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు.

## తంపటాపల్లి విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి గణిత పోటీల్లో ద్వితీయ బహుమతి అందుకుంటున్న తంపటాపల్లి విద్యార్థులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి గణిత క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం పద్మావతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ, ఇటీవల శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఏపీ మ్యాథ్స్ ఫోరం (ఏపీఎంఎఫ్) నేతృత్వంలో చేపట్టిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారన్నారు. ఆర్.సాయికిరణ్, బి.నవ్య, ఎ.దీపికలతో కూడిన బృందం రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. శ్రీకాకుళం డీఈఓ కె.వెంకటేశ్వరరావు, గణిత శాస్త్రవేత్త లక్కోజు సంజీవరాయ శర్మ కుటుంబ సభ్యుల ద్వారా రూ.4 వేల నగదు బహుమతి, జ్ఞాపికలు అందించారన్నారు. విద్యార్థులకు శిక్షణ అందించిన కె.ఆర్.ఎం.జయరావు, ఎస్.రమేష్ పట్నాయక్‌లను స్థానిక డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి, గణిత ఫోరమ్ సభ్యులు ఎస్.సతీష్, తదితరులు అభినందించారు.

## విద్యార్థులకు ప్రోత్సాహకాలు



తూర్పు తీరంలో తెలుగు రేఖలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్‌గోపాల్, తదితరులు

పాలకొండ రూరల్: పట్టణంలో గల వై శశాంక్ చారిటబుల్ ట్రస్ట్, జ్ఞానోదయ గ్రంథాలయంలో ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఇటీవల ఉద్యోగాలు సాధించిన 18 మంది యువతీ,యువకులకు మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయవాది వై.రాజ్‌గోపాల్ మాట్లాడుతూ, యువత స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో ఆస్ట్రేలియాలో స్థిరపడిన రచయిత కొంచాడ మల్లికేశ్వరరావు రచించిన 'తూర్పు తీరంలో తెలుగు రేఖలు' పుస్తకాన్ని గురజాడ విద్యాసంస్థల నిర్వాహకుడు జి.స్వామినాయుడుతో కలసి ఆవిష్కరించారు. ఆస్ట్రేలియాలో తొలితరం తెలుగు వారు మనుగడ కోసం ఎదురీదిన వైనం, ప్రస్తుతం తెలుగు భాషా సంస్కృతిలో వచ్చిన మార్పులపై రచయిత పుస్తకంలో ప్రస్తావించారు. అనంతరం చారిటబుల్ కార్యదర్శి శశికళ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు రూ. 5 వేలను వితరణగా అందించారు. కార్యక్రమంలో గేదల రవీంద్రనాథ్, రౌతు హృషీకేశవరావు, సాహితీవేత్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### యంత్రాంగం స్పందించాలి..



బుక్కూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరసన తెలియజేస్తున్న సభ్యులు

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలపై యంత్రాంగ తక్షణమే స్పందించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఎస్.హిమప్రభ కోరారు. మండలంలోని బుక్కూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద సిబ్బంది ప్లకార్డులతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, న్యాయమైన తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు తమ నిరసన కార్యక్రమాలను అడ్డుకోవద్దన్నారు. అనంతరం ప్రజల మద్దతు కోరేందుకు గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ ప్రతినిధులు దివ్య, ఆర్.భవానీ, రాధ, శారద, ఐద్వా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లకు అన్ని విధాలుగా సహకారం



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ కిరణ్ కుమార్

గుమ్మలక్ష్మీపురం: పెన్షనర్లకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని గుమ్మలక్ష్మీపురం స్టేట్ బ్యాంకు మేనేజర్ బీఎస్ఆర్ ప్రసాద్, యూనియన్ బ్యాంకు మేనేజర్ కిరణ్ కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని వర్తక సంఘం భవనంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్ అధ్యక్షతన ఆదివారం పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ మేనేజర్లు మాట్లాడుతూ.. పెన్షనర్లకు ఎటువంటి సమస్యలున్నా నేరుగా వచ్చి సంప్రదించాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పెన్షనర్లకు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకుల ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగించుకోవాలని సూచించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ జనవరి నెలలో ప్రతీ పెన్షనర్ లైఫ్ సర్టిఫికెట్లు చేయించుకోవాల్సి ఉంటుందని, అందుకోసం కురుపాం ట్రెజరీ అధికారులు అందించే సహకారాన్ని పెన్షనర్లంతా సద్వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు చలపతిరావు, బి.తిరుపతిరావు, చిన్నారావు, ఢిలీ తదితరులు పాల్గొన్నారు.